క్లుప్తంగా

నెమలి ఆలయ హుండీ కానుకల లెక్కింపు



తిరువూరు: నెమలి వేణుగోపాలస్వామి దేవస్థానంలోని హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. ఈ నెల 4 నుంచి గురువారం వరకు ఆలయంలోని 8 హుండీలలో రూ.14 లక్షల 38 వేల 642 ఆదాయం లభించిందని ఆలయ సహాయ కమిషనర్ సంధ్య తెలిపారు.

రీ సర్వేకు సహకరించాలి

మైలవరం: రీ సర్వే బృందానికి రైతులు సహకరించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి మాధురి అన్నారు. రెడ్డిగూడెం మండలం కూనపురాజుపర్వ గ్రామంలో రీ సర్వే గ్రామ సభ, ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ రీ సర్వే వలన రైతుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. పంట భూములకు సరిహద్దులు ఏర్పాటు చేసుకోవడం వలన ఎటువంటి వివాదాలకు తావుండదని చెప్పారు. సమావేశంలో జిల్లా ఏడీ త్రివిక్రమరావు, రెడ్డిగూడెం తహసీల్దార్ జె. సుశీలాదేవి, డీఐ సారంగపాణి, మండల రెవెన్యూ అధికారి గంధం పుల్లయ్య, వీఆర్‌ఓ రాజేష్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఖోఖోలో రాజ్‌కుమార్ ప్రతిభ



నూజివీడు: పట్టణంలోని పాతపేట సచివాలయం-2లో వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీగా పనిచేస్తున్న ధనాల రాజ్‌కుమార్ ఖోఖోలో రాణిస్తుండటంతో గురువారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ ఆర్. వెంకటరామిరెడ్డి అభినందించారు. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఖోఖో పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన రాజ్‌కుమార్ ప్రతిభ కనబరిచి ఏపీ జట్టు తృతీయస్థానంలో నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. అతడిని పాటు టీపీఓ కె. వెంకటేశ్వరరావు, ఆర్‌ఐ ఏవీవీఎల్ నరసింహారావు, డీఈ వెంకట్రావు, ఏఈ పి. వంశీ అభిషేక్ తదితరులు అభినందించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మైలవరం: మైలవరం బార్ అసోసియేషన్ 2025-26 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని మైలవరం బార్ అసోసియేషన్ హాల్లో మాజీ అధ్యక్షుడు ఏడీ ప్రసాద్ అధ్యక్షతన గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రావూరి రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శిగా గుణగంటి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా ఎం.శరత్‌బాబు, సహాయ కార్యదర్శిగా ఎం.తనోజ్‌కుమార్, కోశాధికారిగా పత్తిపాటి రాము, లైబ్రరీ కార్యదర్శిగా పి. రవికిశోర్, మహిళా కార్యదర్శిగా పావులూరి పద్మశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

తిరువూరులో పాస్టర్ల ఆందోళన



తిరువూరు: క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ తిరువూరులో పాస్టర్లు గురువారం ప్రదర్శన నిర్వహించారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర న్యాయ విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని, పాస్టర్లకు రక్షణ కల్పించాలని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన జరిపారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు, తిరువూరు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. పాస్టర్స్ రీజనల్ ఫెలోషిప్ అధ్యక్షుడు బర్నబాస్, తిరువూరు మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పుష్పరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

ఆగిరిపల్లి: నవోదయ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినిని ఎంఈఓలు సర్వేశ్వరరావు, ఆనంద్ కుమార్ అభినందించారు. మండలంలోని శోభనాపురం మండల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థిని పానుగంటి గ్లోరీలత నవోదయ ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించి ఎంపికైంది. విద్యార్థినిని ఎంఈఓలు అభినందించి బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని యామిని కృష్ణ ప్రియ, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ దాసరి రాంప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పన్ను బకాయిలపై రాయితీ

తిరువూరు: తిరువూరు పట్టణంలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలు ఈ నెల 31లోగా చెల్లించిన వారికి అపరాధ రుసుంలో 50 శాతం రాయితీ ఇస్తామని నగర పంచాయతీ కమిషనర్ కె. లోవరాజు తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఈ సదుపాయాన్ని భవన యజమానులు, స్థల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పన్ను బకాయిలు మీసేవా కేంద్రాల్లో, నగర పంచాయతీ కార్యాలయంలో, ఆన్‌లైన్ పోర్టల్‌లో, లేదా సచివాలయాల్లో గానీ చెల్లించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నాడు వ్యతిరేకించి.. నేడు వసూలుకు సిద్ధం!

- గత ప్రభుత్వంలో ఆశీల వసూలును వ్యతిరేకించిన టీడీపీ కౌన్సిలర్లు
- నేడు రింగ్‌గా ఏర్పడి ఆశీల వేలం దక్కించుకున్న వైనం
- ఇప్పుడు ఎలా వసూలు చేస్తారంటూ వ్యాపారుల విస్మయం



ఆశీల వేలం నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన, హాజరైన పాటదారులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీలో ఆశీల వసూలుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిర్వహించిన టెండర్‌ను వ్యతిరేకించి ఆందోళనలు చేపట్టిన టీడీపీ కౌన్సిలర్లు, కూటమి ప్రభుత్వంలో ఆశీల టెండర్ దక్కించుకోవడంపై వ్యాపారులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన ఆశీల టెండర్‌కు బుధవారం వేలం నిర్వహించారు. కూటమి నాయకులు రింగ్‌గా ఏర్పడి రూ.25 లక్షలు పలకాల్సిన టెండర్‌ను రూ.11.30 లక్షలకు దక్కించుకుని మున్సిపాల్టీ ఆదాయానికి గండి కొట్టారనే వాదనలు వినిపిస్తున్నాయి. వైఎస్సార్ సీపీ నాయకులు వేలంలో పాల్గొనకుండా సాల్వెన్సీ సర్టిఫికెట్ నిరాకరించిన అధికారుల తీరును విమర్శిస్తున్నారు.

వైఎస్సార్ సీపీలో ఆశీలు వ్యతిరేకించిన టీడీపీ

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 2023లో ఆశీల వసూలుకు టెండర్లు పిలవగా ఓవ్యక్తి రూ.10.25 లక్షలకు పాడుకుని ఆశీల వసూలుకు సిద్ధపడ్డారు. రెండు రోజులు గడవకుండా మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుతో పాటు టీడీపీ కౌన్సిలర్లు చిరు వ్యాపారుల పొట్టకొట్టొద్దని ఆందోళన చేపట్టారు. టెండర్ రద్దు చేయాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో 8 నెలల పాటు ఆశీల వసూలుకు బ్రేక్ పడింది. ఆతర్వాత ప్రారంభించిన అనంతరం మరలా ఆరోపణలు, ఆందోళనలు చేయడంతో ఆశీల టెండర్ రద్దు చేశారు. టెండర్ రద్దు చేయడంతో పాటదారుడు నష్టపోయాడు.

ధన దాహంతో టెండర్ దక్కించుకున్న టీడీపీ

కూటమి నేతలు ధన దాహంతో ఆశీల టెండర్ దక్కించుకున్నారు. మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన నిర్వహించిన వేలంలో 4వ వార్డు టీడీపీ కౌన్సిలర్ భర్త బాడిశ నాగరాజు రూ.11.30 లక్షలతో ఏడాది కాలానికి పాడుకున్నాడు. గత ప్రభుత్వంలో ఆశీల వసూళ్లను తీవ్రంగా వ్యతిరేకించిన వారే ఇప్పుడు టెండర్ చేజిక్కించుకోవడం హాస్యాస్పదంగా ఉంది. ప్రతిపక్షంలో అక్రమమని ధర్నాలతో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన వారే ఇప్పుడు టెండర్ తీసుకోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రతిపక్షమైతే అక్రమం, పాలకపక్షం అయితే సక్రమమా అంటూ మండిపడ్డారు. నాడు చిరు వ్యాపారులను దోచుకుంటున్నారని అన్నవారే ఇప్పుడు అదే చిరువ్యాపారులను దోచుకునేందుకు రంగం సిద్ధం చేశారు.

టెండర్ కోసం ఒక్కటయ్యారు..

కొండపల్లి మున్సిపాల్టీలో ఆశీల టెండర్ దక్కించుకునేందుకు కూటమి నేతలు అంతా ఒక్కటయ్యారు. కౌన్సిలర్లు, కూటమి నేతలు ఏకమై నలుగురి ద్వారా టెండర్లు వేయించారు. బాడిశ నాగరాజు రూ.11.30 లక్షలు, అడపా దుర్గాప్రసాద్ రూ.11.20 లక్షలు, కొక్కిలిగడ్డ జగన్‌మోహనరావు రూ.11.10 లక్షలు, వడ్లమూడి శ్రీనివాసరావు రూ.11 లక్షలకు టెండర్లు వేశారు. వీరిలో బాడిశ నాగరాజు హెచ్చు పాటదారుడిగా టెండర్ ఖరారు చేశారు. టెండర్‌లో కూటమి ముఖ్య నాయకులు, వార్డు కౌన్సిలర్లకు వాటాలు ఉన్నాయని ప్రచారం సాగుతుంది.

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుల నియామకం

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలోని మూడు మండలాలకు వైఎస్సార్ సీపీ అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట మండలాల అధ్యక్షులుగా తాళ్ళూరి నవీన్‌కుమార్, కావూరి వినయ్‌కుమార్, ఓలేటి దుర్గారావు నియమితులయ్యారు.

మైలవరం నియోజకవర్గంలో..

జి.కొండూరు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మైలవరం నియోజకవర్గంలోని కొండపల్లి మున్సిపాలిటీతో పాటు ఐదు మండలాలకు పార్టీ అధ్యక్షులను గురువారం నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నియామకపత్రాలను విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ జి.కొండూరు మండల అధ్యక్షుడిగా జడ రాంబాబు, కొండపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడిగా పోరంకి శ్రీనివాసరాజు, ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడిగా రెండపల్లి నాగరాజు, మైలవరం మండల అధ్యక్షుడిగా గర్నెపూడి వెంకట్రావు, రెడ్డిగూడెం మండల అధ్యక్షుడిగా కత్తుల వెంకటరెడ్డి, విజయవాడ రూరల్ మండల అధ్యక్షుడిగా బయ్యారపు రవికిశోర్ నియమితులయ్యారు. వీరికి పార్టీ శ్రేణులు అభినందనలు తెలిపారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలి

ఎంపీపీ ఆరేపల్లి శిరీష

నూజివీడు: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఆరేపల్లి శిరీష అధికారులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఏ గ్రామంలో మంచినీటి సమస్య ఉన్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి మండల అభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. సమావేశంలో పలు ప్రభుత్వ శాఖల సమీక్షను నిర్వహించారు. వ్యవసాయాధికారి చాముండేశ్వరి మాట్లాడుతూ రబీ ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి మండలంలో రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. ఒకటి పోతురెడ్డిపల్లిలోను, రెండోది తుక్కులూరులో ఏర్పాటు చేస్తున్నామన్నారు. వేసవిలో మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షలు చేస్తామని చెప్పారు. రైతులు తమ వ్యవసాయ భూమిలోని మట్టి నమూనాలను తీసుకొచ్చి భూసార పరీక్షలు చేయించాలన్నారు. దిగవల్లి సర్పంచి కెత్తే నాని మాట్లాడుతూ రైతులకు గత 8 నెలలుగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వడం లేదని, డబ్బులు కట్టినా ఇవ్వకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి డీవైఈఓ ఎం. సేవియా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రానున్న విద్యా సంవత్సరం నుంచి ఫౌండేషన్ స్కూల్స్, బేసిక్ ప్రైమరీ స్కూల్స్, మోడల్ ప్రైమరీ స్కూల్స్ విధానాన్ని తీసుకువస్తోందని చెప్పారు. బోర్వంచ సర్పంచి కుంటం ఉదయరాజు మాట్లాడుతూ కొన్నంగుంట పరిధిలోని నల్లగట్టును అమరావతి అభివృద్ధికి అవసరమైన గ్రావెల్ తవ్వకాలకు ఉపయోగిస్తారని ప్రభుత్వం సిద్ధమవుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని, దీనిపై గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేసి ప్రజలకు వాస్తవాలను వివరించాలని అధికారులను కోరారు.

సమావేశంలో ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్, పీఆర్ ఈఈ తాడిపర్తి బాబిరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, డెప్యూటీ తహసీల్దార్ రవి కిరణ్ సింగ్, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచిలు పాల్గొన్నారు.

కట్టుబడిపాలెం ఉప సర్పంచ్‌గా వెంకటేశ్వరరావు



కట్టుబడిపాలెం ఉప సర్పంచ్ వెంకటేశ్వరరావుకు నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం



తుమ్మలపాలెం ఉప సర్పంచిగా ఎన్నికైన బేబీకి నియామక పత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి

జి.కొండూరు: మండల పరిధి కట్టుబడిపాలెం ఉప సర్పంచ్‌గా వైఎస్సార్ సీపీ నుంచి ఏడో వార్డు మెంబరుగా గెలుపొందిన బాణావతు వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ గ్రామ పంచాయతీలో పది వార్డులకు గానూ ఎనిమిది వార్డులు వైఎస్సార్ సీపీ గెలుపొందగా రెండు వార్డులను టీడీపీ దక్కించుకుంది. కాగా గురువారం జరిగిన ఉప సర్పంచ్ ఎన్నికకు హాజరైన పది మంది వార్డు సభ్యులు బాణావతు వెంకటేశ్వరరావుని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ క్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె. శ్రీనివాసరావు ఉప సర్పంచ్‌గా ఎన్నికైన వెంకటేశ్వరరావుకి నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దొంతాల సత్యవతి పాల్గొన్నారు.

తుమ్మలపాలెం ఉప సర్పంచిగా బేబీ

తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): తుమ్మలపాలెం పంచాయతీ ఉప సర్పంచి ఎన్నిక గురువారం జరిగింది. రెండో వార్డు సభ్యురాలు నందూరి బేబీ ఉప సర్పంచిగా ఒక్కరే నామినేషన్ వేయడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి మనోజ్ కుమార్ ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించి నియామక పత్రం అందజేశారు. గ్రామ సర్పంచి బొమ్ము వెంకటరమణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి సరోజినీబాయి, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది ఉప సర్పంచి బేబీని అభినందించారు.

కట్టెలేరుపై వంతెన నిర్మించాలని ఆందోళన



వినగడప వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

తిరువూరు: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని సీపీఎం ఎన్టీఆర్ జిల్లా కమిటీ సభ్యులు గువ్వల సీతారామిరెడ్డి విమర్శించారు. గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టెలేరుపై వంతెన నిర్మాణం కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. 500 మంది గ్రామస్తుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని గంపలగూడెం తహసీల్దార్ వి. రాజకుమారికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కట్టెలేరు వంతెన నిర్మిస్తామంటూ ప్రజలకు పదే పదే హామీలిచ్చిన కూటమి నేతలు గెలిచాక ఈ సమస్యను తుంగలో తొక్కారని విమర్శించారు. మండల కేంద్రానికి రావడానికి 20 గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను మాజీ శాసన మండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తెచ్చినా స్పందన శూన్యమన్నారు. వెంటనే వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాలెం ఆనందరావు, అమ్మిరెడ్డి, వీరారెడ్డి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ పగడాలకు నివాళి

నూజివీడు: ప్రముఖ క్రైస్తవ సువార్తికులు ప్రవీణ్ పగడాల మరణం రెండు తెలుగు రాష్ట్రాల క్రైస్తవ సమాజానికి తీరని లోటని నూజివీడు డివిజన్ పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ కేటీ ప్రభాకర్‌రావు అన్నారు. నూజివీడులో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రవీణ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవీణ్ మృతిపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నందున ప్రభుత్వం స్పందించి లోతైన దర్యాప్తు చేయించాలన్నారు. క్రైస్తవులపై దాడుల నివారణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు టి. లాజరస్, ఉపాధ్యక్షుడు వై. సురేష్‌బాబు, కోశాధికారి టి. జీవరత్నం, జాయింట్ సెక్రటరీ బీఎం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జెండా ఆవిష్కరణ



వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న గౌతంరెడ్డి

తిరువూరు: వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గంపలగూడెం మండలం ఊటుకూరులో కొత్తగా నిర్మించిన జెండా దిమ్మెను యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పూనూరు గౌతంరెడ్డి గురువారం రాత్రి ఆవిష్కరించారు. కార్మికుల సంక్షేమానికి యూనియన్ చేస్తున్న కృషిని ఆయన వివరించారు. శుక్రవారం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, జిల్లా కార్యదర్శులు ఆలపాటి ఉమామహేశ్వరరావు, చెరుకు నరసారెడ్డి, మందపాటి ఉమామహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కోట శామ్యూల్, గంపలగూడెం మండల పార్టీ అధ్యక్షుడు కావూరి వినయ్‌కుమార్, నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ రేగళ్ల మోహన్‌రెడ్డి, కోట దాసు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మన్నెం రమేష్



నూతనంగా ఎన్నికైన నూజివీడు బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

నూజివీడు: నూజివీడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మన్నెం రమేష్ ఎన్నికయ్యారు. బార్ అసోసియేషన్ ఎన్నిక గురువారం బార్ హాల్‌లో నిర్వహించారు. మన్నెం రమేష్ ప్యానెల్ ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. కార్యదర్శిగా వై. హరిబాబు, కోశాధికారిగా పి. వేణు, లైబ్రేరియన్‌గా ఎస్‌కేవీడీ ప్రసాద్, మహిళా ప్రతినిధిగా అక్కినేని రమాకుమారి, ఉపాధ్యక్షుడిగా రాణిమేకల సత్యనారాయణ ఎన్నికకాగా మాటూరి రవికాంత్ ప్యానల్ నుంచి జాయింట్ సెక్రటరీగా దొండపాటి సురేష్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సీనియర్ అడ్వకేట్ బోగోలు చంద్రశేఖరరావు వ్యవహరించగా, ఎన్నికల సహాయ అధికారులుగా న్యాయవాదులు బేతాళ వెంకటేశ్వరరావు, ఎల్‌సీహెచ్ వెంకటేశ్వరరావు వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన వారిని బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఇందువల్లి సత్యప్రకాష్, పలువురు న్యాయవాదులు అభినందించారు.

ఎయిమ్స్‌కు బస్సు సర్వీసు నడపాలని వినతి

నూజివీడు: నూజివీడు డిపో నుంచి మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాలకు ఆర్టీసీ బస్సు సర్వీసును నడపాలని బీజేపీ నూజివీడు పట్టణ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి కోరారు. ఈ మేరకు నూజివీడు ఆర్టీసీ డిపో మేనేజర్ పవన్‌కుమార్‌ను బీజేపీ శ్రేణులతో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ శ్రీరామ నవమి సందర్భంగా ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన భద్రాచలంకు ప్రత్యేక సర్వీసులు నడపాలని కోరారు. పట్టణ ప్రధాన కార్యదర్శులు దోనపాటి మల్లికార్జున జగదీష్, దద్దనాల రవికిశోర్, పట్టణ కార్యదర్శి సూర్య ప్రకాష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

చాట్రాయి: మండలంలోని బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీఓ విజయలక్ష్మి గురువారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని చెప్పారు. అభ్యర్థులు దరఖాస్తు ఫారం, ఆధార్, తెల్ల రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ, ఆదాయం వివరాలు, బ్యాంకు పాసు బుక్, పాస్‌పోర్టు సైజ్ ఫొటో తమ వెంట తీసుకురావాలని ఆమె కోరారు.

రుణం ఇప్పిస్తామని మోసగించిన నలుగురి అరెస్ట్

తిరువూరు: తక్కువ వడ్డీకి రుణాలిప్పిస్తామని ఒక కుటుంబాన్ని మోసగించిన నలుగురు వ్యక్తులను గంపలగూడెం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. గంపలగూడెం మండలం అర్లపాడుకు చెందిన కుసుమరాజు సునీత, ఆమె భర్త లక్ష్మయ్యలకు విశాఖపట్నానికి చెందిన సుజిత్ కుమార్‌షా, అజిత్ కుమార్‌షా, అమిత్ కుమార్‌షా, చందనకుమార్ సింగ్‌లు తక్కువ వడ్డీకి రుణం ఇప్పిస్తామని, ఇందుకు అవసరమైన నకిలీ దస్తావేజులు తయారుచేసి ప్రాసెసింగ్ ఫీజు కింద పలు విడతల్లో రూ.60 లక్షలకు పైగా వారి నుంచి వసూలు చేశారు. రుణం మంజూరు కాలేదని జాప్యం చేస్తుండటంతో నలుగురు నిందితులు తమను నమ్మించి మోసగించినట్లు గుర్తించి సునీత గంపలగూడెం పోలీసులను వారం కిందట ఆశ్రయించారు. ఆమె ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసి తిరువూరు కోర్టులో హాజరు పరిచారు.

కవులూరులో ఇఫ్తార్ విందు



కవులూరులో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న జోగి రమేష్

జి.కొండూరు: కుల, మత భేదాలు లేకుండా ప్రజలంతా ఐకమత్యంగా కలిసిమెలిసి ఉండాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా కవులూరులో గురువారం నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక మసీదులో ముస్లిం మత పెద్దలతో కలిసి జోగి రమేష్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుడికి సన్మానం



జి.కొండూరు: ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని జి.కొండూరుకు చెందిన పౌరాణిక నాటక కళాకారుడు తిరుపతిరావును స్థానిక తెలుగు పండితుడు పెదగమ్మళ్ల నాగరాజు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. గ్రామానికి చెందిన పి.సురేంద్రబాబు, జనసేన నాయకుడు పులిపాక ప్రకాష్, బాబు, పి. పద్మావతి, నాగరాణి, కిశోర్ పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుపై కార్యాచరణ సమావేశం

తిరువూరు: తిరువూరు మండలంలో రానున్న ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు గురువారం సమావేశం నిర్వహించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వ్యవసాయాధికారి పద్మ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వ్యవసాయ, వెలుగు, ప్రకృతి సేద్యం సిబ్బంది పాల్గొన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ఖరీఫ్ సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువుల సరఫరా, ప్రకృతి సేద్యం వలన కలిగే లాభాలు, సాగునీటి యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు, కలుపు నివారణ తదితర అంశాలపై అధికారులు సిబ్బందికి సూచనలిచ్చారు. మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షల అనంతరం భూసారాన్ని అనుసరించి విత్తన ఎంపిక, విత్తన శుద్ధి ప్రక్రియలను రైతులకు తెలియజేయాలని రైతు సేవా కేంద్రం సిబ్బందికి సూచించారు. వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ రాజశ్రీ, ఏపీఎం శేఖర్, ప్రకృతి సేద్యం విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

ముసునూరు: సమాజంలో జరుగుతున్న లైంగిక వేధింపులు, నేరాలు, ఘోరాలకు చరమగీతం పాడాలంటే బాలికలు చైతన్యవంతులు కావాలని 15వ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీస్ అథారిటీ చైర్‌పర్సన్ నాగశైలజ అన్నారు. ముసునూరు బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ కొండాబత్తుల ప్రవీణ అధ్యక్షతన లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో పోక్సో చట్టం, బాలికలు, మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపుల నిరోధంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఇంటా తల్లిదండ్రులే తమ పిల్లలకు నైతిక విలువలు, జాగ్రత్తలు, ధైర్యసాహసాలను నేర్పించాలన్నారు. తమ జీవితంలో ఎదురయ్యే సమస్యల విషయంలో దాపరికం లేకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియపరచడం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

ఘనంగా రంగస్థల దినోత్సవం



తిరువూరు: ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని గురువారం స్థానిక పాత శివాలయం ఆవరణలో నిర్వహించారు. సత్యసాయి నాట్య మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్ కళాకారులు పసుపులేటి వెంకయ్య, వజ్రాల ఇందిర, పాతకొట్టు మధుసూదన్‌రెడ్డి, గద్దం సుబ్బారావులను సన్మానించారు. ముఖ్య అతిథులుగా తిరువూరు రచయితల సంఘం అధ్యక్షురాలు ఉయ్యూరు అనసూయ, కాసులనాటి సుబ్రహ్మణ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐలో చలివేంద్రం ప్రారంభం



తిరువూరు: స్థానిక భారతీయ స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచిలో ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని సీనియర్ బ్రాంచ్ మేనేజరు రవికుమార్ గురువారం ప్రారంభించారు. బ్యాంకు ఉద్యోగుల యూనియన్ జోనల్ సెక్రటరీ ప్రసాద్, సభ్యులు ఆనందరావు, గోపీనాథ్, శ్రావణి, సౌగంధి, సునీల్ కుమార్, బ్రహ్మం, సత్యనారాయణ పాల్గొన్నారు.

30న పంచాంగ శ్రవణం

తిరువూరు: ఉగాది పర్వదినం సందర్భంగా ఈ నెల 30న ఉదయం 11 గంటలకు నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ సహాయ కమిషనర్ సంధ్య తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని యజ్ఞశాలలో జరిగే పంచాంగ శ్రవణ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

వాటర్ ప్లాంట్ పరిశీలన

ముసునూరు: వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ భాస్కరరెడ్డి తెలిపారు. లోపూడిలో నాలుగు నెలలుగా నిలిచిపోయిన ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంట్‌ను, ముసునూరు బీసీల శ్మశానవాటికలో మంచినీటి బోరు, మోటారు ఏర్పాటుకు స్థలాన్ని గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు.

మద్యం మత్తులో వ్యక్తిపై దాడి

నూజివీడు: మద్యం మత్తులో దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. తుక్కులూరులోని బ్రాందీ షాపు వద్ద కొలుసు విజయ్‌కుమార్ (35)పై అదే గ్రామానికి చెందిన పున్నం శ్రీనివాసరావు మద్యం సీసాతో దాడి చేశాడు. గాయపడిన విజయ్‌కుమార్‌ను ఏరియా ఆసుపత్రికి తరలించారు. రూరల్ ఎస్‌ఐ లక్ష్మణ్‌బాబు కేసు నమోదు చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణం, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు),
99122 20544 (నూజివీడు),
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com